# దయ గల హృదయమే దైవ మందిరము

**“జంతూనాం నరజన్మ దుర్లభం”.**

అన్ని జన్మల కన్నా మానవ జన్మ చాలా విశిష్టమైనది అని స్వామి చెప్తుంటారు. అటువంటి జన్మను సార్థకం చేసుకోవాలంటే మన హృదయం దయను కలిగి ఉండాలి. అప్పుడే అది నిజమైన మానవ హృదయము. అదియే నిజమైన దైవ మందిరం” అని చెప్తారు స్వామి. మరి అలాంటి కథను  తెలుసుకుందాం.

ఒకసారి ఒక బురదగుంటలో ఒక ఆవు దూడ పడిపోయింది. ఒక కాలుని బయటకు తీయడానికి ప్రయత్నిస్తే, మరొక కాలు మరింత లోపలికి కూరుకుని పోతున్నది. ఈ విధంగా బయటికి రావటానికి అది ఎంతో  ప్రయత్నిస్తూనే వున్నది. ఆ దారిలో వచ్చే పోయే జనం ఎవరూ దాని బాధను నివారించటానికి ప్రయత్నం చేయలేదు. కొందరు ఆ దూడను బయటికి తీయడానికి ప్రయత్నిస్తే తాము కూడా ఆ బురదలో కూరుకుని పోతామేమో అని భయపడి వెళ్లిపోయారు. మరికొందరు తుంటరి యువకులు ఆ ప్రదేశంలో నిలబడి దూడ చేసే ప్రయత్నం చూసి, నవ్వుకుంటున్నారు.

ఇంతలో ఆ మార్గంలో ఒక సాధువు వెళుతూ ఆ దూడ పడే అవస్థ చూసి తల్లడిల్లి పోయాడు. వెంటనే ఏమాత్రం ఆలోచించక బురద లోనికి దిగాడు. అక్కడ ఉన్నటువంటి ఆ యువకులు “బలవంతులమైన మనమంతా ఇక్కడ ఉంటే, ఈ బక్క చిక్కిన సన్యాసి  దూడను బయటికి తీస్తాడట” అంటూ హేళన చేయసాగారు.

కానీ ఆ సాధువు వీరి మాటలు పట్టించుకోకుండా, భగవన్నామస్మరణ చేస్తూ “తన దేహ బలంతో పాటు భగవంతుని అనుగ్రహ బలం కూడా చేర్చమని ప్రార్థిస్తూ”  ఆ దూడను ఉపాయంగా సగం మెల్లిగా లాక్కుంటూ, సగం మోసుకుంటూ గట్టుకు చేర్చి, దానికి కొంత నీరు తాగించాడు. అప్పుడు ఆ తుంటరి యువకులు “గొప్ప సేవ చేశావు లే. మేము ఇంకా కొద్దిసేపు తమాషా చూసేవాళ్లం కదా! మా ఆనందాన్ని అడ్డుకున్నావు” అన్నారు.



ఆ సాధువు వారితో “నాయనలారా! నేను చేసింది సేవ కాదు, ఉపకారం కాదు. ఆ దూడ పడిన బాధను చూచిన నాకు చాలా బాధ కలిగింది. నా బాధను నివారించుకోవడానికి ఆ పని చేశాను. ఇప్పుడు నా బాధ తగ్గినది” అంటూ తన దారిన తాను వెళ్ళిపోయాడు.

“అందరిలోనూ వున్న దైవత్వం ఒక్కటే” అని తెలుసుకున్న రోజు అన్నిజీవుల భాధను మన బాధగా భావించగలుగుతాము. *Help Ever - Hurt Never; Love All - Serve All* అని అంటారు స్వామి.అంతేకాక “నిస్ సహాయులకు సహాయ పడటమే నిజమైన ఆధ్యాత్మికత ,వారికి చేసే సేవలు నేను స్వీకరిస్తాను” అంటారు. అలా సేవ చేయడానికి హృదయం ప్రధానం కానీ, వయస్సుకాదు. మరి అలాంటి కథను తెలుసుకుందాము.

ఒక గ్రామంలో చాలా పేద కుటుంబం ఉండేది. వారికి ఒకే ఒక కుమార్తె .ఆ ఊరిలో పాఠశాల లేనందువల్ల ఆ అమ్మాయిని పక్క గ్రామంలో పాఠశాలకు పంపేవారు. ఆ ఊరి నుండి పక్క గ్రామానికి వెళ్లడానికి ఒక చిన్న అడవిని దాటుకుని వెళ్ళవలసి వచ్చేది. ఈ విధంగా ఆ అమ్మాయి రోజు ఉదయం వెళ్లి, సాయంత్రం ఇల్లు చేరేది. ఆ అమ్మాయి వెళ్లే దారిలో ఒక సత్రం ఉండేది. ఆ అమ్మాయి స్కూల్ కు వెళుతూ ఆ సత్రంలో దీనస్థితిలో వున్న ఒక వ్యక్తిని చూసి, అతను అనారోగ్యంతో ఉన్నట్టుగా గ్రహించి, తన దగ్గర ఉన్న ఫలహారాన్ని అతనికి ఇచ్చి, నీరు ఇచ్చి వెళ్ళింది. తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు అతనికి తగిన ఔషధాన్ని ఇచ్చి, తినడానికి పండ్లను ఇచ్చి, కాసేపు అతనికి సేవ చేసి వెళ్ళింది. ఒక పది రోజుల తర్వాత అతనికి కొంత శక్తి వచ్చింది. అప్పుడు అతను ఆ అమ్మాయితో “బంగారు తల్లీ! నీవు నాకు ఆహారాన్ని, ఔషధాన్ని ఇచ్చి నా ప్రాణాన్ని కాపాడావు. కానీ నీకు ఈ ఆహారం ఏవిధంగా లభించింది ?

నీ తల్లిదండ్రులకు ఈ విషయం తెలుసా? లేక నీవు ఎక్కడైనా అపహరించావా? లేక నీవు తినకుండా నాకు పెడుతున్నావా?నిజం చెప్పు?” అని అడిగాడు. “అయ్యా! నేను ఎక్కడా అపహరించలేదు. ఆ గుణం నాలో లేదు. నా తల్లిదండ్రులకు తెలియకుండా నేను ఏ పని చేయను. నేను వచ్చే దారిలో రేగిపళ్ల చెట్టు ఉన్నది.



ఆ పళ్ళను ఏరి, మూటకట్టుకుని బాలబాలికలకు అమ్మి, ఆ డబ్బుతో మీకు ఔషధాన్ని, ఆహార పదార్థాలను, పండ్లను తెచ్చి ఇస్తున్నా ను. “దీన స్థితిలో ఉన్న వారికి సహాయం చేయమని మా తల్లిదండ్రులు నాకు చిన్న తనం నుంచే బోధిస్తూ వచ్చారు.” అని చెప్పి ఇంటికి వెళ్ళి పోయింది. కొంతకాలానికి ఆ వ్యక్తికి ఆరోగ్యం బాగయినందువల్ల తిరిగి తన గ్రామానికి వెళ్ళిపోయాడు.

కొంతకాలం తర్వాత ఆ అమ్మాయిని వెతుక్కుంటూ వారి గ్రామానికి వెళ్ళాడు. వారి ఇంటి తలుపు తట్టగా ఆ అమ్మాయి తండ్రి వచ్చి తలుపు తీసాడు. అప్పుడు అతను తనను పరిచయం చేసుకుని“మీ అమ్మాయి చేసిన సహాయం వల్లనే నేను సంపూర్ణ ఆరోగ్యవంతుడినయ్యాను”. మీ అమ్మాయి చాలా పవిత్రమైన హృదయం కలది. దయా హృదయురాలు. కనక నేను ఇచ్చే ఈ బహుమతి స్వీకరించండి అంటూ డబ్బు సంచీని వారికి అందించాడు. అప్పుడు ఆ అమ్మాయి తండ్రి ఎంతో వినయంతో “మాకు ఈ ధనం అవసరం లేదు. మా అమ్మాయి ప్రతిఫలాన్ని ఆశించి మీకు సేవ చేయలేదు. భగవంతుడు “ అందరికీ సహాయపడే హృదయాన్ని ఇలాగే ఎల్లప్పుడూ ఇవ్వాలని కోరుకుంటాము.” అని చెప్పాడు. “హృద్ + దయ =హృదయ. అనగా దయతో నిండిన హృదయము. అదియే నిజమైన మానవ హృదయము”. అటువంటి వారిని నిరంతరము , ఇంట, వెంట, జంట ఉండి కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటానని స్వామి చెప్తారు.

అలాంటి సంఘటన ఒకటి ఇప్పుడు చెప్పుకుందాము. స్వామి యొక్క పూర్వ విద్యార్థి శ్రీధర్ సుబ్రహ్మణియన్, ఒకసారి అతను శ్రీ సత్య సాయి విశ్వవిద్యాలయ ప్రాజెక్టు వర్క్ లో చాలా బిజీగా ఉండటం వల్ల స్వామి యొక్క దర్శనానికి వెళ్లుటకు వీలు కాలేదు. మరుసటి దినం స్వామి దర్శనము నకు వెళ్ళగా, అతని మిత్రుడు “స్వామి మాకందరికీ పాదనమస్కారం ఇచ్చారు. నీవు ఆ అవకాశాన్ని కోల్పోయావు కదా” అన్నాడు.

భజన ప్రారంభమైనది. అప్పుడు అతను స్వామితో మనసులో “స్వామీ! నేను నీ పని చేస్తూ ఉండటం వల్ల, పాద నమస్కారం సమయానికి రాలేకపోయాను. నాకు నిజంగా అదృష్టం లేదా” అంటూ సంభాషించెను.



హఠాత్తుగా స్వామి సింహాసనం పై నుంచి లేచి నేరుగా అతని వద్దకు వచ్చి, పాదనమస్కారం తీసుకోమని చెప్పెను. ఆనందంతో అతను స్వామి పాదములను నమస్కరించుకొనెను. మన హృదయములో పవిత్రమైన భావములు వున్నప్పుడు, మన హృదయ మందిరమే స్వామి నివాస స్థలము. స్వామి ఎంతో దయా సముద్రుడు కనుకనే విద్యార్థి మనసులోని ఆర్తిని అందుకునేను.

పుట్టపర్తిలో  ఎదురుగా కూర్చుని పిలిస్తేనే స్వామి పలుకుతారా ? కాదు, కాదు. భక్తితో మనము "సాయి" అని పిలిస్తే "ఓయి" అని పలుకుతారు. "బాబా" అని పిలిస్తే "బంగారూ" అని పలుకుతారు. మనము ఒక్క అడుగు స్వామి వైపు వేస్తే, మన కోసం నూరు అడుగులు వేస్తారు . అలా అనంతపురం జిల్లా ప్రజలు ఆర్తితో పిలిచిన పిలుపుకు స్పందించిన స్వామి, వారి దాహార్తిని ఎలా తీర్చారో ఇప్పుడు తెలుసుకుందాము.

## శ్రీ సత్యసాయి ప్రేమామృతధార

అనంతపురం జిల్లా బీడుబారిన నేలలతో, భూగర్భజలాల కొరత కలిగియున్న ప్రాంతము. అక్కడి నీరు ఉప్పు మరియు ఫ్లోరైడు ను అధికంగా కలిగి ఉన్నందు వల్ల ప్రజలలో ఎముకల అనారోగ్యత మరియు దంత సంబంధమైన సమస్యలు అధికంగా వున్నవి." త్రాగు నీరు లేక బాధ పడు రాయలసీమకు ఏడాది పొడుగునా నీటి సరఫరా ఉండేలా చూడాలి. దీనిని రత్నాల సీమ గా మార్చాలి" అనే ఉద్దేశంతో శ్రీ సత్య సాయి రక్షిత మంచినీటి పథకం అను ప్రాజెక్టున మార్చి 1995 లో మొదలుపెట్టారు. ఈ ప్రాజెక్టు 250 కోట్ల వ్యయంతో, 2000 కిలోమీటర్ల పైప్లైన్ల ద్వారా మొట్ట మొదటి విడతలో 279 గ్రామాలకు నీటిని అందించారు. ఇందులో నీటి సరఫరా నాలుగు విధాలుగా జరుగుతుంది.

- Direct pumping scheme
- Infiltration well scheme
- Summer storage tank scheme
- Bore well scheme.






ఆ తర్వాత 2001 లో మహబూబ్ నగర్ మరియు, మెదక్ జిల్లాలలో త్రాగునీటి సమస్య ఉన్న 320 గ్రామాలకు 530 మిలియన్ల వ్యయంతో శ్రీ సత్యసాయి సుజల స్రవంతి ద్వారా మంచి నీటిని అందించారు.

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలోని అటవీ ప్రాంతంలో ఉండే గిరిజనులు త్రాగునీటిలో (బోరు నీటిలో)ఆరోగ్యానికి హాని కలిగించే విషపూరిత రసాయనాలు ఉండటం వలన అనారోగ్య సమస్యలు అధికం కాసాగినవి.

స్వామి 2007 వ సంవత్సరములో 535 కిలోమీటర్ల పైప్లైన్ల ద్వారా 4.7 లక్షల మందికి "శ్రీ సత్య సాయి రక్షిత మంచినీటి పథకం" ద్వారా (వడపోత, శుద్ధీకరణ మొదలగు పద్ధతుల ద్వారా) వారికి సురక్షితమైన నీటిని అందించారు. "వేయి తల్లుల ప్రేమ స్వామి ప్రేమ"... ఆ ప్రేమామృతధారను చెన్నై వాసులు కూడా అందుకున్నారు.

1996 లో ప్రభుత్వం వారు చేపట్టిన "కండలేరు-పూండి" జలాశయాలను కలిపే "తెలుగు గంగ" ప్రాజెక్టు పూర్తి అయినది.

అయినప్పటికీ చెన్నై వాసుల దాహార్తి తీరలేదు.2002 లో స్వామి చెన్నై వాసుల త్రాగు నీటి కొరతను పరిష్కరించ సంకల్పించారు వెంటనే కండలేరు -పూండి జలాశయం సామర్థ్యం పెరిగే విధంగా దానిని పునరుద్ధరించి, "సాయి గంగా ప్రాజెక్ట్ " ద్వారా చెన్నై వాసులకు త్రాగు నీరు అందించడమే కాక, ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో మూడు లక్షల వ్యవసాయ భూములకు సాగునీటిని అందించారు.





భగీరధుని తపస్సు ద్వారా గంగాదేవి,

శివుని జటాజూటం ద్వారా

ఈ భువి పై ఎలా ప్రవహిస్తున్నదో,

స్వామి సంకల్పం ద్వారా " సాయి గంగ" పల్లెపల్లెల కు పైపులను పరవళ్లు తొక్కుతూ,

వారి దాహార్తిని తీర్చుచున్నది.

గగన వీధుల విహరించు గడుసు గంగ,

హరుని ఆజ్ఞను తలదాల్చి అవని చేరే

పర్తివాసుడు చేసిన ప్రతిన చూసి,

పయనమయ్యెను పైపులో పల్లెలకును !

పిల్లలు మనము స్వామి లాగా పెద్ద పెద్ద water projects చేయలేక పోవచ్చు, కాని మంచి నీటిని వృద్ధా చేయకుండా జాగ్రత్తగా వాడి ప్రకృతి వనరులను సంరక్షిద్దాము.




**సమస్త లోకాః సుఖినో భవంతు**